రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



మల్కాజ్‌గిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ జయంతి

..జిల్లా కోర్టు కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన వేడుకలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22, ప్రభాతవార్త: మల్కాజ్‌గిరి బార్ అసోసియేషన్ (న్యాయవాదులు) ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు కాంప్లెక్స్ ప్రాంగణంలో జిల్లా బార్ అసోసియేషన్ ఆద్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. అనివార్య కారణాల వల్ల కార్యక్రమాన్ని ఆలస్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యులు కె.సునీల్‌గౌడ్, అదే విధంగా మల్కాజ్‌గిరి కోర్టు ఎక్జిక్యూటీవ్ కమిటీ వారు నిర్వహించారు.

మేడ్చల్-మల్కాజ్‌గిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ జయంతి

వరికి బదులు ఇతర పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలి

వికారాబాద్,ప్రభాతవార్త : వరి సాగును నియంత్రించి ప్రత్యామ్నాయ రబీ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్‌దీపక్ తివారి అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యవసాయ శాఖ ఏడీఏ, ఎంఏఓ అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు పరిస్థితి, పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ, డిజిటల్ క్రాప్ సర్వే, వనమహోత్సవం కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో ప్రస్తుతం సాగు చేసిన వరి విస్తీర్ణాన్ని సమీక్షి ంచి, ఇకపై వరి సాగు విస్తీర్ణం పెరగకుండా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వరి సాగుకు ఉద్దేశించిన మిగిలిన భూములను ముందస్తు రబీ పంటలు, ముఖ్యంగా కుసుమ, పప్పు దినుసులు, వేరుశెనగ వంటి పంటల సాగు వైపు మళ్లించేలా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- కుల్కచర్ల మండలంలో దొంగల బీభత్సం
- నాలుగు ఇళ్లలో చోరీ
-భారీగా వెండి బంగారం చోరీ

కుల్కచర్ల, ఆగస్టు 22, ప్రభాతవార్త: మండల పరిధిలో దొంగలు విరుచుకుపడి వరుస చోరీలకు పాల్పడ్డారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ అర్ధరాత్రి వేళల్లో తాళాలు పగలగొట్టి భారీగా బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... కుల్కచర్ల మండల పరిధిలోని సుభాష్‌నాయక్ తండా, కేతావత్ బాలయ్య తండా, మోత్కుర్‌గ్రామ్ పరిధిలోని రామ్‌గోపాల్ నాయక్ తండాల్లో దొంగలు ఈ భయాందోళన సృష్టించారు. కేతావత్ సరిత రవి నాయక్ ఇంట్లో 1 కిలో వెండి ఆభరణాలు, కేతావత్ బాలయ్య ఇంట్లో 20 తులాల వెండితో పాటు రూ.20,000 నగదును పహారీ దొంగలు దోచుకెళ్లారు. అలాగే రామ్‌గోపాల్ నాయక్ తండాలోని మరో రెండు ఇళ్లలో జొరబడి, కేతావత్ దేవిమ్మ ఇంట్లో 20 తులాల వెండి, అర తులం బంగారాన్ని ఎత్తుకెళ్లారు.

బాధితురాలు సునిత.

తాళం పటలగొట్టి చోరీకి గురైన ఇల్లు

మొత్తంగా ఈ వరుస చోరీల్లో 2 తులాల బంగారం, కిలోకు పైగా వెండి, రూ.30,000 నగదు మాయమైనట్లు సమాచారం.

ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఘటనా స్థలానికి వచ్చి ప్రాథమికంగా నమూనాలు సేకరించి వెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన పురోగతి లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగా, రాత్రి వేళల్లో దొంగలు ఇంటి చుట్టూ తిరుగుతున్న దృశ్యాలు ఓ సిసి కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యాయి. వరుస దొంగతనాలతో రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడే పరిస్థితి నెలకొందని, అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి చోరీకి గురైన సొత్తును రికవరీ చేయాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

భూ భారతి చట్టం కింద

పట్టా మార్పునకు గడువు ఇవ్వాలి

..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు మేడ్చల్ జిల్లా రైతు సమాఖ్య కమిటీ వినతిపత్రం

..కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రైతు సమాఖ్య కమిటీ సమావేశం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22, ప్రభాతవార్త:

భూ భారతి చట్టం ప్రకారం మేడ్చల్ జిల్లా రైతులు మీసేవాలో పట్టా మార్పునకు ధరఖాస్తులు చేసుకున్న అర్జీదారులకు వివరణ తీసుకోకుండా నిరాకరించే ముందు రైతుల నుంచి వివరణా సంజాయిషీ తీసుకోవటానికి వారం రోజుల గడువు ఇవ్వాలని అనుమతి ఇవ్వటానికి జిల్లా రైతు సమాఖ్య కమిటీ తీర్మాణం చేసింది. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లా రైతు సమాఖ్య సమావేశం జిల్లా అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈ సమావేశంలో పలువురు జిల్లా రైతులు మాట్లాడుతూ భూభారతిలో మీ సేవా ద్వారా పట్టా మార్పునకు ధరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించకుండానే, ధరఖాస్తు దారునికి సరైన కారణం తెలుపకుండానే చాలా దరఖాస్తులు నిరాకరిస్తున్నారని అన్నారు. రైతుల కోరిక మేరకు మీ సేవాలో పట్టా మార్పునకు ధరఖాస్తు చేసుకున్న వారికి నిరాకరించే ముందు 7రోజుల గడువును తీసుకుని పట్టామార్పునకు కావలసిన డాక్యుమెంట్లను ఇచ్చుటకు అవకాశం ఇవ్వగలరని జిల్లా రైతు సమాఖ్య కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి జిల్లా రైతు సమాఖ్య కమిటీ తరపున పలువురు రైతులు పాల్గొని పట్టామార్పు విషయంపై వివరణకు గడువు ఇవ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి, గౌరవాధ్యక్షులు వంగ పెంటారెడ్డి, ఉపాధ్యక్షులు సింగం అంజనేయులు, ప్రధాన కార్యదర్శి బండి జగన్నాదం, కోశాధికారి సంగిశెట్టి అంజనేయులు, సహాయ కార్యదర్శులు ఏడ్ల సుదాకర్‌రెడ్డి, కె.జగన్మోహన్‌రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరిగిన జిల్లా రైతు సమాఖ్య సమావేశం జరిగిన దృశ్యం

హకీంపేట్ గ్రామసభలో నాలుగు కీలక తీర్మానాలు

దుద్యాల్, ఆగస్టు 22, ప్రభాతవార్త: హకీంపేట్ అభివృద్ధి, రైతుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల కాపాడటం, పారిశ్రామిక ప్రగతికి సహకారం.. ఈ నాలుగు అంశాలే లక్ష ్యంగా హకీంపేట్ గ్రామసభలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామం లో రాజకీయ విభేదాలు, తగాదాలను పక్కనపెట్టి అభివృద్ధి బాటలో కలిసికట్టుగా నడవాలని పిలుపునిస్తూ, నాలుగు ప్రధాన తీర్మానాలను గ్రామసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

గ్రామ ఉపసర్పంచ్ మహేష్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పంచాయతీకార్యదర్శి ఆనంద్ వివిధ ఎజెండా అంశాలను గ్రామస్తులకు చదివి వినిపించారు. గ్రామం లో కూరగాయల సంత ఏర్పాటు, బస్‌స్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయింపు, ప్రభుత్వ, గ్రామకంఠం భూముల పరిరక్షణ, చెత్త సేకరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ముఖ్యంగా సర్వేనంబర్ 252లో గతంలో పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన నేపథ్యంలో, మిగిలిన ప్రభుత్వభూమిని సర్వే చేసి స్పష్టమైన హద్దులు నిర్ణయించాలని తీర్మానించారు. వైకుంఠధామం, పాఠశాల, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (ఎస్‌డబ్ల్యూఎం షెడ్) వంటి ప్రజావసరాలకు భూమిని కేటాయించాలని కలెక్టర్‌కు తీర్మానం పంపాలని నిర్ణయించారు. గ్రామకంఠం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, లైబ్రరీతోపాటు ఇతర ప్రజావసరాలకు స్థలం అందుబాటులో లేకపోవడంపై కూడా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

సభలో బిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎర్ర వెంకటయ్య మాట్లాడుతూ గ్రామంలో రాజకీయ విభేదాలు, తగాదాలను పక్కనపెట్టి అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. మరో రైతు మాట్లాడుతూ అసైన్డ్ భూముల సేకరణతో పశు పక్ష్యాదులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ జీవజాతుల అవసరాలకు తగిన స్థలం కేటాయించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యదర్శి ఆనంద్ తెలిపారు.

ఎజెండా అంశాలను చదివి వినిపిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ హకీంపేట్ రైతులు, ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. తనపై వ్యక్తిగత ఆరోపణలకు సమాధానం చెబుతానని, అయితే గ్రామం, రైతుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హకీంపేట్ రైతులకు భూసేకరణలో ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు.

అనంతరం గ్రామసభలో నాలుగు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. హకీంపేట్ రైతులు నిజాయితీపరులని, రైతుల పక్షాన నిలిచిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలపడం, గ్రామంపై తప్పుడు ప్రచారంపై అభ్యంతరం వ్యక్తం చేయడం, సర్వే నంబర్ 252లో మిగిలిన ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించడం, గ్రామాభివృద్ధికి సహకరించిన రైతులు, గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం వంటి తీర్మానాలు చేశారు.

గ్రామసభసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దుద్యాల ఎస్సై శ్రీశైలం, కొడంగల్ ఎస్సై సత్యనారాయణ, దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్, బొంరాస్‌పేట్ ఎస్సై బాల వెంకటరమణతో పాటు సుమారు 60 మంది పోలీసు సిబ్బంది భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర వెంకటయ్య, చాకలి శ్రీనివాస్, మల్లేశం, నరేందర్‌రెడ్డితో పాటు

రైతును చొక్కా పట్టి లాగిన ట్రాఫిక్ సిఐపై ఫిర్యాదు

- గొర్రెల లోడుతో వెళ్తున్న వాహనాన్ని అడ్డుకుని, రైతుపై దౌర్జన్యం చేశారంటూ ఆరోపణలు - షాద్‌నగర్ ట్రాఫిక్ సిఐ శంకరయ్య దౌర్జన్యం - రైతును చొక్కా పట్టి వాహనం నుండి బయటకి లాగిన సీఐ - ట్రాఫిక్ సిఐపై డిసిపి శివం ఉపాధ్యాయకు ఫిర్యాదు - కమ్మేట గ్రామ రైతు కాంత్ రెడ్డి గల్లా పట్టి బయటికీడ్చిన సిఐ - తన వాహనం నుండి బలవంతంగా గొర్రెలను దింపి రోడ్డుపై వదిలేసిన వైనం

షాద్‌నగర్, ఆగస్టు 22, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ ట్రాఫిక్ సీఐ శంకరయ్యపై రైతు కాంత్‌రెడ్డి దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు చేశారు. తనను చొక్కా పట్టుకుని వాహనం నుంచి బయటకు లాగడంతో పాటు, తన కుమారుడిపై చేయి చేసుకున్నారని కాంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చేవెళ్ల మండలం కమ్మెట గ్రామానికి చెందిన రైతు కాంత్‌రెడ్డి శనివారం గొర్రెలను పెబ్బేరు సంతలో కొనుగోలు చేసి ఓ వాహనంలో తీసుకెళ్తుండగా షాద్‌నగర్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహన డ్రైవర్ మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని కూడా పోలీసుల అదుపులోకి తీసుకుంటామని సీఐ శంకరయ్య చెప్పినట్లు కాంత్‌రెడ్డి తెలిపారు. అయితే వాహనంలో గొర్రెలు ఉన్నాయని, వాటిని రోడ్డుపై దింపితే ఇబ్బందులు తలెత్తుతాయని సీఐకి వివరించినట్లు చెప్పారు. డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అతని లైసెన్సును స్వాధీనం చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో సీఐ శంకరయ్య తనపై ఆగ్రహం వ్యక్తం చేసి, చొక్కా పట్టుకుని వాహనం నుంచి బయటకు లాగారని కాంత్‌రెడ్డి ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నించిన తన కుమారుడు నితీష్‌రెడ్డిపై కూడా చేయి చేసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా వాహనంలోని గొర్రెలను బలవంతంగా రోడ్డుపై దింపి, వాహనాన్ని పోలీసుల అదుపులోకి తీసుకున్నారని కాంత్‌రెడ్డి ఆరోపించారు. తనను, తన కుమారుడిని దూషిస్తూ అవమానించారని, చేయి చేసుకున్నాడని, రైతు అనే గౌరవం కూడా చూడకుండా వ్యవహరించారని కాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రశ్నించినప్పుడు కేసులు పెడతామని బెదిరించడం సరికాదని అన్నారు. ఈ ఘటనలో అందరూ చూస్తుండగానే రైతును కింద పడేసి మరి లాక్కెళ్లారని తెలిపారు. అవసరమైతే నీమీద కేసు పెడతా అంటూ మరి శంకరయ్య బెదిరించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై సీఐ శంకరయ్య వివరణ కోరేందుకు మీడియా ప్రయత్నించగా ఆయన ఫోన్ స్పందించలేదని తెలిసింది. ఘటనపై ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలని కోరినట్లు చెప్పారు. తప్పు చేసిన డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే రైతులపై దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదని కాంత్‌రెడ్డి అన్నారు. తనకు న్యాయం జరగకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షాబాద్ సిఐ గా ఉన్న సమయంలో ఏసీబీకి అడ్డంగా పట్టుబడి అవినీతికి పాల్పడిన కేసు ఆయనపై ఉందని అలాంటి వ్యక్తి ప్రజల పట్ల ఎలా వ్యవహరిస్తారు? ఉన్నతాధికారులు అర్థం చేసుకోవాలని ఈ ప్రాంతంలో కూడా సిఐగా వ్యవహరించినప్పుడు అనేక అక్రమాలకు దౌర్జన్యాలకు పాల్పడ్డారని వారు మీడియాకు సమాచారం అందజేశారు.

పరిశ్రమలు తీసుకురావడం చేతకాకపోతే

భూములను తిరిగి ఇవ్వండి

మోమిన్‌పేట్, ఆగస్టు 22. ప్రభాతవార్త: పరిశ్రమలు తీసుకురావడం చేతకాకపోతే అట్టి భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని తెలంగాణ మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మరియు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోమిన్‌పేట్ మండల పరిధలోని ఎన్కతల గ్రామంలో మొబిలిటీ వ్యాలీ ప్రాంతాన్ని వారు సందర్శించారు.

ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ ఎన్కతల గ్రామంలో 1,100. వందల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుకానున్న పరిశ్రమను ఎందుకు నెలకొల్పడం లేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ.....ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, ఆందోళనలను అడిగి తెలుసుకున్న సబితారెడ్డి, ఆనంద్‌లు మాట్లాడుతూ.....మా ప్రభుత్వ హయాంలో రైతుల భూములకు తగిన పరిహారం అందించి, రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

రైతుల భూములను అభివృద్ది కోసం తీసుకున్నప్పుడు, వారికి తగిన పరిహారం అందించడంతోపాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సి నబాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. మొబిలిటీ వ్యాలీ ప్రాంతంలో కంపెనీలను తీసుకువచ్చి స్థానిక రైతులకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కంపెనీలు తీసుకువచ్చి స్థానిక రైతులకు ఉపాధి కల్పించడం చేతకాకపోతే.....రైతుల భూములను తిరిగి వారికి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పటేల్ శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు నాగేందర్ గౌడ్, జిల్లా ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు విజయకుమార్, శుభప్రద్ పటేల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచు సంఘం అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్, వేణుగోపాల్‌రెడ్డి, టేకులపల్లి సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, నారాయణరెడ్డి, కష్ణ, మల్లయ్య, ప్రతాప్‌రెడ్డి, అభిమానులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న దృశ్యం

సురక్షితంగా పాఠశాలకు చేరాలి..విద్యను కొనసాగించాలి

- ప్రభుత్వ పాఠశాలకు బిట్స్ కాలనీ నుంచి
- విద్యార్థులు రావటానికి ఉచితంగా ఆటో ఏర్పాటు
- మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 22, ప్రభాతవార్త: అంతాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బిట్స్ కాలనీ నుంచి పేద విద్యార్థులు వస్తున్నందున వారికి రవాణా సౌకర్యం కల్పించటానికి స్వంతంగా ఆటో సౌకర్యంను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ఏర్పాటు చేశారు. విద్యార్థులను తీసుకవస్తున్న ఆటో డ్రైవర్ నాగరాజుకు 8వేల రూపాయలు ఆటో కిరాయి స్వంతంగ జైపాల్‌రెడ్డి అందజేశారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులను తీసుకవస్తున్న ఆటో డ్రైవర్ నాగరాజుకు కిరాయి 8వేల రూపాయలు చెల్లించారు. శామీర్‌పేట డివిజన్ పరిధిలోని అంతాయిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను పున ప్రారంభించిన సంగతి తెలిసిందే. విద్యార్థుల రవాణా సమస్యను పరిష్కరించటానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి ఆటోను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పాఠశాలకు నిత్యం అంతాయిపల్లి గ్రామానికి దూరంగ ఉన్న బిట్స్ కాలనీ నుంచి వస్తున్నారని చిన్నారులు పాఠశాలకు చేరుకోవటానికి ఇబ్బందిగ ఉన్నట్లు గుర్తించి వారి రాకపోకల గురించి ఆటోను ఆయన స్వయంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని, తమ చదువును కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం తన వంతు సహకారం ఉంటుందని ఎల్లపుడు ముందు ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల రాకపోకల కోసం ఆటోను ఏర్పాటు చేసిన జైపాల్‌రెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



అంతాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు బిట్స్‌కాలనీ నుంచి విద్యార్థులు రావటానికి స్వంతంగ ఆటో సౌకర్యం కల్పించిన మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి దృశ్యం

ఉత్సాహంగా గిరిజనుల తీజ్ వేడుక

ఘట్‌కేసర్, ఆగష్టు 22, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో శనివారం గోర్ సమాజ సంస్కృతి, సంప్రదాయాలు ఐక్యతను చాటే తీజ్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డివిజన్ గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీజ్ పండుగ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిపించారు. ఈకార్యక్రమం అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాములు నాయక్, మాజీ ఉపాధ్యక్షుడు అనుజా, డి.జి.నాయక్, ఉపాధ్యక్షుడు రూపావత్ నరేష్, కల్చర్ మెంబర్ వాలునాయక్‌ల ఆధ్వర్యంలో జరిగింది. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి-మాజీ కౌన్సిలర్ బొక్క సంగీత దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్బంగా నాయకులు మాట్లాడుతూ గోర్ సమాజం ఐక్యత, ఆధ్యాత్మికత, సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పండుగ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరుపగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీజ్ పండుగ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతలు సాంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడుతూ తీజ్ నృత్యాలు చేశారు. గోర్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైలులో మహిళ మృతి

ఘట్‌కేసర్, ఆగష్టు 22, ప్రభాతవార్త: వివాహ వేడుకల్లో పాల్గొని వస్తున్న ఓమహిళ రైలులో మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్‌లో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ బాలాజీ నగర్‌కు చెందిన శివం జానకీ (42) కుటుంబసభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురంలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని తిరిగి నాగావళీ ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా అస్వస్థతకు గురైంది. జానకీఅకస్మికంగా పడిపోయి చనిపోవడంతో కుటుంబసభ్యుల బోరున విలపించారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు ఆపగా జిఆర్‌పి పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

20 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అత్తాపూర్ ఆగస్టు22,ప్రభాతవార్త : అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.శనివారం స్టేషన్ పరిధిలోని 20 మంది రౌడీషీటర్లను పిలిపించి అత్తాపూర్ ఎస్‌హెచ్‌ఓ ఏ. సీతయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్ల ప్రస్తుత కార్యకలాపాలు, వారి ప్రవర్తనపై పోలీసులు ఆరా తీశారు.ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించినా, గొడవలు, బెదిరింపులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ ఏ. సీతయ్య తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

20 డార్క్ స్టోర్‌లలో ఫుడ్‌సేఫ్టీ దాడులు

హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త: నగరంలో ఆహార భద్రత ప్రమాణాల ఉల్లంఘనలపై టిజిసేఫ్ అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కలిసి మొత్తం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. నగరంలోని డార్క్ స్టోర్లపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా బిగ్‌బాస్కెట్,బ్లింకిట్,జెప్టో చెందిన 20 డార్క్ స్టోర్లలో అధికారులు సోదాలు చేపట్టారు. ఆహార పదార్థాల నిల్వ, నిర్వహణ, పరిశుభ్రత, నాణ్యతకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు స్టోర్లలో పరిశుభ్రత ప్రమాణాలు సరిగా పాటించకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాలను సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయడం, వాటి నిర్వహణ, స్టోరేజీ ప్రాంతాల పరిశుభ్రత విషయంలో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన, సురక్షి తమైన ఆహార పదార్థాలు అందేలా నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

చిక్కడపల్లి ఆగస్టు 22, ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ అధికారులు విడుదల చేసిన నూతన ఓటర్ల ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రతులను కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ (బాబ్జి) శనివారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ నుండి అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలని అధికారులను కోరారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న యువ ఓటర్ల పేర్లను, అలాగే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి బదిలీ (షిఫ్టింగ్) అయిన వారి పేర్లను సరైన రీతిలో పరిశీలించి జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సవరణల ప్రక్రియలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా, సాంకేతిక లోపాలు తలెత్తకుండా సమన్వయంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాగ్‌లింగంపల్లి, అడిక్ మెట్, రాంనగర్ , కవాడిగూడ, భోలక్ పూర్, ముషీరాబాద్, బాకారం, బాపూజీనగర్ అధ్యక్షులు నవీన్ నాయక్, డికొండ కిరణ్, అర్షాన్ హుస్సేన్ , డి.రమేష్, రహీముద్దీన్, ఎల్.శ్రీకాంత్ గౌడ్, సంగపాక వెంకట్, ఎస్.నరేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిఎంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్, ఆగస్టు 22, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ స్పష్టం చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చేలా వ్యక్తిగత విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడి పదేళ్ల పాలనకు చరమగీతం పాడారన్నారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి ప్రజా పాలనను తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ముఖ్యమంత్రిపై కొండా సుస్మిత నోటికొచ్చినట్లు మాట్లాడటం సమంజసం కాదని, ఆమె చేసిన వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ సమర్థించడం లేదా కుమార్తెను వెనుకేసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉందని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. సామాన్య కార్యకర్తగా, బీసీ బిడ్డగా తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి ప్రజల మధ్య నిలబెట్టిందని, పార్టీ తనకు కల్పించిన అవకాశాన్ని ఎప్పటికీ మరచిపోలేనన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎవరైనా ఎంతటి వారైనా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

ఐఎన్‌టియుసిలో చేరిన క్యాబ్ డ్రైవర్లు

హైదరాబాద్ ఆగస్టు 22, ప్రభాతవార్త ఐఎన్‌టియుసి అనుబంధ సంస్థ 'తెలంగాణ స్టేట్ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లో సుమారు 200మంది క్యాబ్ డ్రైవర్లు చేశారు. ఈ సందర్భంగా నారాయణగూడలోని ఐఎన్‌టీయుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సభలో ఐఎన్‌టీయుసి నాయకులు ఆర్.డి.చంద్రశేఖర్, మహ్మద్ షబీర్, గోధ మల్లేష్ గౌడ్, హమీద్ పటేల్, జక్క నాగమల్లయ్య, నాగరాజ్, సాయి కిరణ్, మహ్మద్ సియాన్, వెంకటేష్, ఎం.శ్రీనివాస్, సుభాష్, అంజి, రాము, పోతు సంతోష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలు, డిమాండ్లు, యూనియన్ సభ్యత్వం ద్వారా లభించే ప్రయోజనాలు, మెరుగైన పని పరిస్థితులు, సరైన వేతనాలు,సామాజిక భద్రత కోసం యూనియన్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం త్వరగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గిగ్ ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్యాబ్ డ్రైవర్లకు సరైన మీటర్ విధానం మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని,ట్రాఫిక్ పోలీసుల వేధింపులు, ట్రాఫిక్,ఆర్టీఏ ఛలాన్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

న్యాయవిద్యకు నిరంతర శ్రమ అవసరం

చిక్కడపల్లి ఆగస్టు 22 ,ప్రభాతవార్త : న్యాయవిద్యను అభ్యసించడం సులభమైన విషయం కాదని, దీనికోసం నిరంతర శ్రమ, అంకితభావం అవసరమని రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు విశ్రాంత హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. శనివారం చిక్కడపల్లి లో పెండెకంటి న్యాయ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థుల ప్రవేశోత్సవం , ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవడానికి విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, సమగ్రంగా అధ్యయనం చేయాలి. న్యాయ వృత్తికి సమాజంలో ఎంతో ప్రాముఖ్యత ఉందో వివరిస్తూ, బాధితులకు న్యాయం అందించేలా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

వృద్ధులైన తల్లిదండ్రులను గౌరవించాలి : సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి ఆగస్టు 22, ప్రభాతవార్త : వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల కొందరు పిల్లలు ప్రవర్తిస్తున్న తీరు మానవత్వానికే మచ్చగా మారుతోందని శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై భీమన్న సాహితీ నిధి కళానిలయం సంయుక్త నిర్వహణలో ప్రముఖ రచయిత్రి హైమవతి భీమన్న తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఖికొత్తూరు వెంకట లక్ష్మి శ్రీ కొత్తూరి సుబ్బయ్య దీక్షి తులు సాహితీ పురస్కారాన్నిఖి ప్రముఖ సాహితీవేత్త కేతవరపు రాజ్యశ్రీకి సిరికొండ మధుసూదనాచారి బహుకరించి మా ట్లాడుతూ దశాబ్దాల క్రితం మృతిచెందిన తల్లిదండ్రుల పేరిట పురస్కారాన్ని ఏర్పాటు చేసి హైమవతి చూపి స్తున్న గౌరవం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమ న్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ , ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు, రాజ్యశ్రీ

ప్రముఖ సాహితీవేత్త కేతవరపు రాజ్యశ్రీకి కొత్తూరి సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

వెన్నెల ప్రక్రియ ద్వారా తక్కువ పదాలతో లో తైన భావాలను అందించిన ఉత్తమ రచయిత్రి అని పేర్కొన్నారు. హైమవతి భీమన్న స్వాగతం పలుకుతూ ప్రతి ఏటా తన తల్లిదండ్రుల పేరిట రూ. 5,116ల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు పుష్పలత, కార్యదర్శి

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం : చంద్రశేఖర్ ప్రసాద్

శేరిలింగంపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని శేరిలింగంపల్లి నియోజక వర్గ టీఆర్ఎస్ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ టీఆర్ఎస్ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా బి. రఘు, ప్రధాన కార్యదర్శిగా వి.పవన్ కుమార్‌లను నియమించారు. వారితో పాటు వివిధ కళాశాలల నుంచి వచ్చిన 50మందికి పైగా విద్యార్థులు తెలంగాణ రక్షణ సేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నూతనంగా టీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలకు వాసిలి చంద్రశేఖర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీలో జరగబోయే ఎన్నికల్లోనూ, 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ పార్టీ అధిక సీట్లు సాధించి అధికారంలోనికి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.విద్యార్థి నాయకులందరూ సమిష్టిగా కృషి చేసి పార్టీని గెలిపించాలని, టీఆర్ఎస్ అధినేత్రి కవితను ముఖ్యమంత్రిని చేయటమే ధ్యేయంగా

తెలంగాణ రక్షణ సేనలో చేరిన కార్యకర్తలకు కండువాకప్పిపార్టీలోనికి ఆహ్వానిస్తున్న వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తదితరులు

పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లిన టీఆ ర్ఎస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన, మద్దతు లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ లో ఏ ఎన్నికలు వచ్చినా గెలిచేది టీఆర్ఎస్ పార్టీయేనని ఆయన స్పష్టం చేశారు. టీఆర్ఎస్‌లో చేరిన వారిలో యువకులు శ్రీను, సాయి, అనికేత్, యోగేందర , మణిప్రీ త్,నాని, అభిరామ్,నరేంద్ర,తేజ,విశాల్,అరుణ్‌తో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు సందీప్, టీఆర్ఎస్ బీసీ ప్రెసిడెంట్ విష్ణు, టీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు దారుపల్లి అనిల్

బాలనగర్‌లో హిందూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రారంభోత్సవం

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 22, ప్రభాతవార్త బాలనగర్‌లో హిందూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, కూకట్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సి.హెచ్. హనుమంతరావు తదితరులు ముఖ్య అతిథిగా హాజరై ఇన్స్టిట్యూట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ, విద్య, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో నూతన తరానికి మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి వారిని దేశ



అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షి ంచారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా విద్యాసంస్థలు కృషి చేయాలని సూచించారు. హిందూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భవిష్యత్తులో విద్యా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు

ఉత్సాహంగా భాషిత జూనియర్ కళాశాల స్వాగతోత్సవ సంబరాలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 22, ప్రభాతవార్త ఐడిపిఎల్‌కు చెందిన భాషిత జూనియర్ కళాశాల నూతన విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమం శనివారం షాపూర్ నగర్‌లోని శుభమ్ సెలబ్రేషన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.కళాశాల చైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో పాటు కఠోర శ్రమ, ఏకాగ్రత, సమయపాలనతో ముందుకు సాగాలని సూచించారు. కరస్పాండెంట్ తాటిచెర్ల శైలజ, డైరెక్టర్ తాటిచెర్ల హేమలత విద్యార్థుల్లో లక్ష్యసాధనపై అవగాహన కల్పిస్తూ ఉత్సాహాన్ని నింపారు. క్యాంపస్ అధినేత తాటిచెర్ల కృష్ణ పాల్గొన్నారు.జబర్దస్త్ కళాకారులు అదుర్స్ ఆనంద్, అవతార్ చిట్టిబాబు, ఫణి పాల్గొని వివిధ స్కిట్లు, హాస్య ప్రదర్శనలు, నృత్యాలతో విద్యార్థులను, ఆహుతులను అలరించారు. విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలు,



కార్యక్రమంలో నూతన విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది

హాస్య స్కిట్లు, ర్యాంప్‌వాక్‌లతో సందడి చేస్తూ రోజంతా ఉత్సాహంగా గడిపారు.కార్యక్రమం ముగింపులో భాషిత జూనియర్ కళాశాల ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం మెరిట్ సర్టిఫికెట్లను అందజేసింది. అలాగే రానున్న విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయి టాపర్ ర్యాంకులు సాధించే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తామని యాజమాన్యం ప్రకటించింది.

జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



పేట్ బషీరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో వార్షిక ఫ్రెషర్స్ డే వేడుకలతో పాటు నూతనంగా ఎన్నికైన విద్యార్థి మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల విలువలను కాపాడుతూ, తమకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తామని విద్యార్థి నాయకులు ప్రతిజ్ఞ చేశారు.అనంతరం కళాశాల వేదికపై విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్యాలు, సంగీతం, నాటక ప్రదర్శనలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ ప్రదర్శనలు తల్లిదండ్రులు, సహ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.విద్యా, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ నరిశెట్టి సుందర రాజు, విద్యా దర్శకురాలు నరిశెట్టి సరిత, డీన్ రాంబాబు, ఉప ప్రిన్సిపాల్ గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నరిశెట్టి సుందర రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో కనిపిస్తున్న ఉత్సాహాన్ని అభినందించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యార్థి నాయకులు ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తూ, కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది. కొత్త విద్యా సంవత్సరానికి ఈ వేడుకలు ఉత్సాహభరితమైన శుభారంభంగా నిలిచాయి.

పాతతరం సినీ గీతాలకు నేటికీ ఆదరణ



చిక్కడపల్లి ఆగస్టు 22 ప్రభాతవార్త : పాతతరం సినీ గీతాలు నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో మనోరంజని మెలోడీస్ - ఆదర్శ్ ఫౌండేషన్, నవరస గాయని ఆమనీ నిర్వహణలో సినీ దిగ్గజాలు-1 సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గాయకులు కిషోర్ కుమార్, వి. రామకృష్ణ పాడిన పాటలను ప్రముఖ గాయకులు పి. సుబ్బాష్, కృష్ణ ప్రసాద్, అంజనేయశాస్త్రి, శ్రీకాంత్ చారి తదితరులు పాతతరం మధుర గీతాలను ఆలపించి సంగీతాభిమానులను మంత్రముగ్ధులను చేశారు. విజయమూరి కృష్ణ కు రామకృష్ణ ఆత్మీయ పురస్కారం, పి. వెంకటేశ్వరరావు కు కిశోరె స్పూర్తి పురస్కారాన్ని అందించి గౌరవించారు. దామోదర్ గుప్తా మాట్లాడుతూ సంగీతానికి ఎల్లలు లేవని, మంచి పాటలకు కాలంతో సంబంధం లేకుండా ఆదరణ ఉంటుందని పేర్కొన్నారు. ఆదర్శ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి సంయుక్త కార్యదర్శిగా చర్మాణి రూప్‌రాజ్

చార్మినార్,ఆగస్టు 22 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ గౌలిపుర ప్రాంతానికి చెందిన చర్మాణి రూప్‌రాజ్ గణేష్ ఉత్సవ సమితి సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రాఘవ రెడ్డి పాతనగరానికి చెందిన చర్మాణి రూప్‌రాజ్‌ను గణేష్ ఉత్సవ సమితి జాయింట్ సెక్రటరీగా నియమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు.

మణికొండలో రోడ్డు విస్తరణ చేయాలని భారీ ర్యాలీ

నార్సింగి, ఆగస్టు 21 ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మణికొండ డివిజన్‌లో రోడ్డు విస్తరణ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం భారీ ర్యాలీ నిర్వహించారు. మణికొండలోని మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ వరకు న్న రహదారిని వెంటనే విస్తరించాలని, ప్రభుత్వం మొద్దు నిద్రను వీడాలని వందలాది మంది పెద్ద పెట్టున నినదించారు. కుల,మత,రాజకీయాలకు అతీతంగా స్థానికులంతా కలిసి ఈ రహదారి విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న బిఆర్ఎస్ మణికొండ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ మణికొండ మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ వరకున్న రోడ్డు 100.ఫీట్లదని, ఇప్పుడు కేవలం 40.ఫీట్లకు కుదించబడిందన్నారు. దీని వలన ప్రతిరో జూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి తాము నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. ఉదయం 8.గంటల నుంచి 11.గంటల వరకు సాయంత్రం 4.గంటల నుంచి రాత్రి 8.గంటల వరకు ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఆర్టీఏ కార్యాలయంకు నిత్యం వచ్చే వందలాది వాహనాలకు

మణికొండ మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ వరకు రోడ్డు విస్తరణ చేయాలని భారీ ర్యాలీ నిర్వహించిన స్థానికుల దృశ్యం

తోడు కాలనీలకు వెళ్లే వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉందని, అనేక మార్లు అధికారులు, మంత్రుల దృష్టికి సైతం ఈ సమస్యను తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంను కోరినా ఫలితం రాలేదని, ఈ సర్కారు అయినా స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. రోడ్డుపైనే ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించకపోవడం వలన సమస్య మరింత జఠిలం అవుతుందన్నారు. మాస్టర్ ప్లాన్‌లోని రోడ్డును విస్తరణ చేసి తీరాలని, ప్రజల ప్రధాన ఇబ్బందులను దూరం చేయాలని ర్యాలీలో పాల్గొన్న వివిధ కాలనీల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో ఏఐ ఆధారిత అంతర్జాతీయ న్యాయ సేవలు

హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త: భారత్‌ను అంతర్జాతీయ న్యాయ సమాజంతో బలమైన వారధి. గా అనుసంధానం చేయడం మా లక్ష్యం అని ప్రముఖ అంత ర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాస్ అన్నారు. సరిహద్దులు దాటి న్యాయ వ్యవహారాల్లో మార్గదర్శకత్వం అవసరమైన వ్యక్తులు, వ్యాపార సంస్థలకు అంతర్జాతీయ న్యాయవాదులు, సొలిసిటర్లు, బ్యారిస్టర్లు, అడ్వకేట్ల సేవలను మరింత అందు బాటులోకి తీసుకురావాలని భావిస్తున్నామన్నారు. మా ఏఐ కార్యక్రమం న్యాయ అవగాహనను పెంపొందించి, సమాచారా నికి ప్రాప్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉందని, అదే సమయంలో అత్యున్నత వృత్తిపరమైన న్యాయ ప్రమాణాలను కొనసాగిస్తామన్నారు. కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్ హైదరాబాద్‌లో తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించ నుందని వెల్లడించారు. బంజారా హిల్స్‌లోని ప్రెసిడెంట్ బంజారా హిల్స్, ఫ్లాట్ నంబర్ డి3, రోడ్ నంబర్ 2, ముగ్ధ సిల్క్స్ పక్కన ఉన్న కార్యాలయం ఈనెల 24 న ఉదయం 11:30 గంటలకు తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్యంగా .ఏఐతో న్యాయ అవగాహహైదరాబాద్ కార్యాలయ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఆధునిక న్యాయ విధానాలతో బాధ్యతాయుతంగా అనుసం ధానం చేయడం కీలక అంశంగా ఉంటుందని సంస్థ తెలిపింది. న్యాయ పరిశోధన, సమాచారాన్ని సులభంగా పొందడం, ప్రాథమిక న్యాయ అవగాహన కల్పించడం, క్లిష్టమైన న్యాయ అంశాలను అర్థం చేసుకోవడంలో ఏఐ, ఆధునిక లీగల్ టెక్నాలజీలను సహాయక సాధనాలుగా వినియోగించనున్నట్లు పేర్కొంది. వృత్తిపరమైన న్యాయ సలహాలు, న్యాయ ప్రాతిని ధ్యం మాత్రం సంబంధిత చట్టాలు, వృత్తిపరమైన ప్రమాణా లకు అనుగుణంగా అర్హత కలిగిన న్యాయ నిపుణుల ద్వారానే అందించబడతాయని సంస్థ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ, బహుళ విభాగాల న్యాయ నిపుణుల నెట్‌వర్క్ మద్దతుగా ఉంది. ఇందులో కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్ ప్రిన్సిపల్ ఫౌండర్ డా. శ్రీనివాస రావు కావేటి, కెనడాకు చెందిన అజ్మేరా లా ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ ఫౌండర్ డా. ప్రశాంత్ అజ్మేరా, అమెరికాకు చెందిన ఎడ్వర్డ్ ఓసీ, రామ్‌సే యర్ అవుకు, పార్థ్ సింగ్, యూకేకు చెందిన అడ్వకేట్ అనుప్రి యా చావ్లా, అలాగే భారత్‌కు చెందిన పలువురు హైకోర్టు న్యాయవాదులు, అంతర్జాతీయ న్యాయ సలహాదారులు ఉన్నారు.

హిమాయత్ సాగర్ ఎకో పార్కులో మొక్కల పంపిణీ



హిమాయత్ సాగర్ ఎకో పార్కులో మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నార్సింగి, ఆగస్టు 22 ప్రభాతవార్త : వన మహోత్సవంలో భాగంగా శనివారం హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్ట్ విభాగం అధికారులు హిమాయత్ సాగర్ ఎకో పార్కులో మొక్కల పంపిణీని చేశారు. పార్కుకు వచ్చిన ప్రజలకు అధికారులు పళ్లు, పూలను ఇచ్చే మొక్కలతో పాటు అలంకరణ మొక్కలను పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ప్రజలందరూ తమ పరిసర ప్రాంతాలలో మొక్కలను పెద్ద ఎత్తున పెంచుకోవాలని, మొక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో వాయు కాలుష్యం తగ్గి, స్వచ్ఛమైన గాలి వీస్తుందని, దీన్ని పీల్చుకున్న ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అధికారులు పేర్కొన్నారు. మొక్కలను నాటడంతో పాటు మూడేళ్ల పాటు వాటిని సంరక్షిస్తే, అవి మనం జీవించినంత కాలం మనకు ప్రాణ వాయువును అందిస్తాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పెద్ద ఎత్తున అందరం మొక్కలు నాటుదామని అధికారులు పిలుపునిచ్చారు.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు

జిల్లా ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్

హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త: ధూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌ను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి కె. విజయ భాస్కర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని క్రైమ్ ఫైళ్లను, స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలను పరిశీలించారు.అనంతరం అప్పట్లో గంజాయి విక్రయాలకు పాల్పడినట్లు గుర్తించిన వ్యక్తుల ఇళ్లను బలరాం గల్లీ, యతీంఖానా, కరీబౌలి, మగర కమాన్, బడా బంగ్లా తదితర ఎగువ ధూల్‌పేట్ ప్రాంతాల్లో తనిఖీ చేశారు. ధూల్‌పేట్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న గంజాయి రహిత పరిస్థితులను కాపాడేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారి సూచించారు. ఎవరైనా గంజాయి విక్రయాలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలనిఆదేశించారు.ఈ తనిఖీల్లో మధు బాబు, ఇన్‌స్పెక్టర్ జి. గోపాల్, ఎస్ఐలు సైదులు, విష్ణు, ఉమా మహేశ్వర్, లలితతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు ఏజెంట్లు అరెస్ట్



గంజాయి రవాణా చేస్తున్న నిందితులను అరెస్ట్ చేసిన గాంధీనగర్ పోలీసులు

ముషీరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త: ఎండు గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురు ఏజెంట్లను గాంధీనగర్ పోలీసులు మరియు సీసీఎస్ స్పెషల్ క్రైం టీమ్ సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడుకు చెందిన రాజారామ్ స్వామి కణ్ణుపడయాచి(78), మహారాష్ట్రకు చెందిన సంతోష్ బలరామ్ ప్రజాపతి(65), విజయలక్ష్మి కలియమూర్తి పిళ్లై (66), మహారాష్ట్రకు చెందిన సిల్మినా కుజూర్(36), శీలాదేవి(48)లు విశాఖ జిల్లా అరకు నుంచి ముంబైకి గంజాయిని రవాణా ఏజెంట్లుగా పనిచేస్తునానరు. ఒక వ్యక్తి సూచనల మేరకు వీరు అరకులో బ్రౌన్ కలర్ పార్సిల్ కవర్లలో ప్యాక్ చేసిన ఎండు గంజాయిని భారీ మొత్తంలో సేకరించి, అక్కడ నుంచి బస్సులలో హైదరాబాద్ చేరుకుని, ఆపై మరో బస్సు ద్వారా ముంబైకి తరలిస్తున్నారు. ప్రధాన సూత్రధారి సూచనల మేరకు ముంబైలో పలు ప్రాంతాలలో ఈ గంజాయి పార్శిళ్లను అందచేస్తున్నారు. వృద్ధులు, మహిళలు కావటంతో ఎవరికీ అనుమానం రాకుండా వేర్వేరు బస్సులలో హైదరాబాద్ మీదగా ముంబైకి చేరుస్తూ ఉన్నారు. ఈ క్రమంలో వారు హైదరాబాద్‌లో న్యూబోయిగూడలోని రాఘవేంద్ర హోటల్ వద్ద ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి గాంధీనగర్ పోలీసులతో కలసి సీసీఎస్ స్పెషల్ క్రైం టీమ్ వారిని అదుపులోకి తీసుకుని, పది లక్షల విలువైన 38 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు లేదా పంపిణీలో ఎవరూ భాగస్వాములు కావద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.

కొనేందుకు వచ్చి కొట్టేసారు..

- కాజేసిన ఐదుగురి ముఠా

జూబ్లీహిల్స్, ఆగస్టు 22, ప్రభాతవార్త: బట్టలు కొనేందుకు వచ్చినట్లు నటించి ఖరీదైన బట్టలు కొట్టేసుకెళ్లిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండకు చెందిన నామా సుజాత శ్రీ సాయి ఎం పోరియం పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 20న రాత్రి ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు కలిసి కస్ట మర్లుగా దుకాణానికి వచ్చారు. చీరలు, డ్రెస్సులు చూపించా లంటూ సుజాతను మాటల్లో పెట్టి దృష్టి మరల్చారు. అనం తరం ఫోన్‌పే ద్వారా చెల్లింపు చేస్తున్నట్లు నటించి అక్కడి నుం చి వెళ్లిపోయారు. వారు వెళ్లిన తర్వాత దుకాణంలో పరి శీలించగా 17 పట్టుచీరలు, 8 డ్రెస్సులు కనిపించలేదు. వీటి విలువ సుమారు రూ.70 వేలుగా ఉంది. దీంతో బాధితురాలు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

మోసాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు...

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 22, ప్రభాతవార్త : ఏటీఎం సెంటర్ల వద్ద కాపుకాచి వినియోగదారుల దృష్టి మరల చి మోసాలకు పాల్పడుతున్న నీతిని కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. ఏపీ డిగ్రీ కాలనీ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కురంగి విద్యాసాగర్ (33) ఏటీఎంల వద్ద కాపు కాస్తు వచ్చిపోయే వినియోగ దారులను టార్గెట్ చేస్తూ పలు మోసాలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈనెల 13న కెపిహెచ్‌బి కాలనీ 9వ ఫేస్‌లోని ఎస్బిఐ ఎటిఎం సెంటర్ వద్ద 506 ఏళ్ల మహిళ తన వద్ద గల రెండు లక్షల రూపాయలతో నిలబడి ఉండగా సహాయం చేస్తానని చెప్పిన నిందితుడు కొంత నగదును తీసుకొని నకిలీ ఫోన్ పే లావాదేవీ చూపించి నగదుతో పరారైనట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సిసి ఫుటేజ్ ఆధారంగా నిందితుడు కోసం గాలింపు చేపట్టగా నిందితున్ని అతడి సహచరుడు బాలాజీని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 70 వేల నగదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకు న్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్ తెలంగా ణ ప్రాంతాలలోని 19 కేసులలో సంబంధం ఉన్నట్టు పోలీసులకు తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు అరెస్టు

సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త: ప్రైవేటు పాఠశాలలో హౌస్ కీపింగ్ పని చేస్తున్న వృద్ధురాలి హత్య కేసుమిస్టరీని మీర్‌పేట్ పోలీసులు ఛేదించారు.హత్యకు గురై నీటి సంపులో మూట గట్టిన స్థితిలో మృతదేహం లభ్యమైన ఇరవై నాలుగు గంటల్లోనే పోలీసులుదర్యాప్తును వేగవంతం చేసి హంతకుడిని అరెస్టు చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమిళనాడురాష్ట్రానికి చెందినవలసదారుడైన స్థానిక చిప్స్ షాపు నిర్వాహకుడే వృద్ధురాలి బంగారి చెవి కమ్మల కోసం ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు తేల్చారు. ఈ మేరకు నిందితుడు ప్రకాశ్ మురుగున్‌ను అరెస్టు చేసిబంగారు కమ్మలను స్వాధీనం చేసుకున్నారు.

PUBLIC NOTICE

Mr. Nagilla Kumara Swamy S/o Mr. Nagilla Linga Murthy offered to create mortgage of schedule property in favour of my client. He purchased the same from Dr.P.Kistaiah S/o Mr. Venkataiah through sale deed dated: 21.08.2002 registered as document No.3957 of 2002 in the office of Sub Registrar, Shadnagar as the only legal heir of his wife late Mrs. P. Bhagyalakshmi W/o Mr. P. Kistaiah who purchased the same through a sale deed dated: 11.09.1998 registered as document No.4237 of 1998 in the office of Sub Registrar, Shadnagar. It is informed that Dr.P.Kistaiah is the only legal heir of late Mrs. P. Bhagyalakshmi.

Any body having right, interest and claims against the schedule property may send their claims in writing within ONE WEEK from the date of this public notice to the under signed with supporting documents. Thereafter my client will proceed further with the transaction.

SCHEDULE

All that the house property bearing No.13-304 (No.1187007644) in Plot No.81 in Sy.No.185 admeasuring 200 sq.yards or 167.22 sq.mts situated at Shadnagar Village and Gram Panchayat, previously Mahaboobnagar District presently Ranga Reddy District and bounded by: North: Plot No.82, South: Plot No.80 East G.P.Road, West: Plot No.56.

Sd/- R.V. SUBBA RAO
ADVOCATE
NO.F-132 1ST FLOOR DOWN-TOWN MALL LAKADIKAPOOL, HYDERABAD 500 004
PH: 9246501145
srinadhar@gmail.com

అన్ని హంగులతో ముస్తాబు అవుతున్న
మహిళ సమైక్య భవనం

నందిగామ, ఆగస్టు 22, ప్రభాతవార్త : నందిగామ మండ్రల లోని సిడితండా గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎఫ్ ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనం నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. సర్పంచ్ గబ్రు చౌహాన్, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్ , వార్డు సభ్యులు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు పాత్లావత్ శ్రీనివాస్, సభ్యులు దగ్గరుండి పర్యవేక్షి స్తున్నారు. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ మారుస్తూ కొత్తగా స్తంభాలను పునరుద్ధరించారు. అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఈ భవనం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభం కానుందని, అందుకే పనులు వేగవంతం అయ్యాయని సర్పంచ్ గబ్రు చౌహాన్ తెలిపారు. ఈ సందర్భంగా అన్ని హంగులతో భవనాన్ని ముస్తాబు చేస్తున్నారు.

సిడితండాలో ప్రారంభానికి ముస్తాబ్ అవుతున్న మహిళా సమైక్య భవనం

నందిగామలో బోరుబావి తవ్వకం

01 : నందిగామలో బోరుబావి తవ్వకపు పూజల్లో సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు

నందిగామ, ఆగస్టు 22, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని 5 వ వార్డు జె ఎస్ ఆర్ వెంచర్ లో పది శాతం భూమిల్లో నిర్మిస్తున్న ఇరిగేషన్ శాఖ భవన నిర్మాణం కోసం శనివారం సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్‌తో కలిసి బోరుబావి త్రవ్వించారు. ఈ సందర్భంగా జరిగిన పూజలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, సింగిల్ విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ సి నర్సింలు, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, చించేటి లత శివకుమార్ గౌడ్,శివగల్ల సురేష్,సింగిల్ విండో డైరెక్టర్ కేశమోని ఆంజనేయులు యాదవ్,కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి,

సిద్దాపూర్ చెత్త తరలింపు కేంద్రం
రద్దు కోసం శాసనసభలో పోరాడాలి

షాద్‌నగర్, ఆగస్టు 22, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఏకో టౌన్ పేరుతో చెత్త తరలింపు కేంద్రం ఏర్పాటు కోసం 86 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి బదలాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సిద్దాపూర్ చెత్త తరలింపు కేంద్రం వ్యతిరేక పోరాట సమితి నాయకులు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ చెత్త తరలింపు కేంద్రం ఏర్పాటు వల్ల సిద్దాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 50 గ్రామాల ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. చెత్త నుంచి వెలువడే దుర్వాసన, విషపూరిత ద్రవాలు, హానికర వాయువుల వల్ల ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. చెత్త కుళ్లడం వల్ల వెలువడే మీథేన్, కార్బన్ డయాక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి వాయువులతో శ్వాసకోశ సమస్యలు, ఉబ్బసం, అలర్జీలు, చర్మవ్యాధులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. మీథేన్ వాయువు వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.చెత్త నుంచి వెలువడే విషపూరిత ద్రవం భూమిలోకి ఇంకి భూగర్భ జలాలను కలుషితం చేసే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాంతంలోని గొలుసుకట్టు చెరువుల ద్వారా కలుషిత నీరు హైదరాబాద్‌కు తాగునీటిని అందించే హిమాయత్ సాగర్‌లోకి చేరే అవకాశం ఉందని తెలిపారు. ఒకవైపు మూసీ నదిని సుందరీకరించి కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం, మరోవైపు మూసీ పరివాహక ప్రాంతంలో చెత్త కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో చెత్త తరలింపు కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల చెత్తకు ఆకర్షితమయ్యే పక్షుల కారణంగా విమానాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతిపాదిత ప్రాంతంలో భూగర్భ వాయువు సరఫరా పైపులైన్ ఉండటంతో భవిష్యత్‌లో భారీ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. చెత్త కేంద్రం ఏర్పాటుతో పరిసర ప్రాంతాల్లో భూముల విలువలు భారీగా పడిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సురక్షి తమైన ఆహారం అందడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే చెత్త తరలింపు కేంద్రం రద్దు కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేస్తున్నారని గుర్తు చేసిన నాయకులు, ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 641ను వెనక్కి తీసుకునేలా శాసనసభలో ప్రజల తరఫున బలంగా పోరాడాలని కోరారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి

చెత్త కేంద్రం రద్దు కోసం నా వంతు కృషి కొనసాగిస్తా: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ"డంపింగ్ యార్డు రద్దు కోసం నా వంతు కృషి చేస్తున్న విషయం మీరు గుర్తించారు. తప్పకుండా శాసనసభలో ప్రజల పక్షాన పోరాటం చేస్తాను. చెత్త కేంద్రం రద్దు కోసం నా వంతు కృషి కొనసాగిస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ చెత్త తరలింపు కేంద్రం వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సహాధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, ఈశ్వర్ నాయక్, సహ కన్వీనర్లు భూక్యా రజిత, రవీంద్రనాథ్, శ్రీకాంత్, పవన్ చౌహాన్, మహేష్, సలహాదారులు అబ్దుల్ రబ్ జామి, నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ధవెల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి భూమి పూజ

కేశంపేట ,ఆగస్టు 22, ప్రభాతవార్త :యువతకు స్ఫూర్తిదాయకం చాకలి ఐలమ్మ అని నిర్ధావెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్ అన్నారు. కేశంపేట మండలంలోని నిర్ధవెల్లి గ్రామంలో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని సర్పంచ్ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని, ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, తోపాటు బి ర్ స్ పార్టీ కేశంపేట్ మండల అధ్యక్షుడు తోట వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ సిల్వేరు మల్లయ్య, వాజీద్, రజక సంఘం సభ్యులు జంగయ్య, బాలకృష్ణ, రాజు, మహేష్, బాలు,శివ మరియు పరిశుద్ధ కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బబ్బుభాయ్ అనారోగ్యంతో కన్నుమూత

పూడూరు, ఆగష్టు 22, ప్రభాతవార్త : పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు సయ్యద్ గౌస్(బబ్బుభాయ్) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందారు.గ్రామ పంచాయతీ వార్డు సభ్యులుగా 5 పర్యాయాలు,జాయింట్ అకౌంట్ మెంబర్‌గా,పాఠశాల విద్యాకమిటి చైర్మన్‌గా ఒక్కోసారి కొనసాగి గ్రామానికి ఎనలేని సేవలు అందించారు.మండలంలోనే మారుమూల గ్రామంగా పేరున్న కడ్మూరులో బాలికల చదువు అర్ధాంతరంగా ఆగిపోతోందన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఏర్పాటుకోసం సుమారు 25 సంవత్సరాలుగా పోరాటం చేసి విజయం సాధించారు.గ్రామంలో ఎలాంటి (తగవులు)పంచాయతీలనైనా తన వాక్చాతుర్యంతో పరిష్కరించేవారు.కుల,మతాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే బబ్బుభాయ్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురికాగా,చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.పదవిలో ఉన్నాలేకున్నా ప్రజల శ్రేయస్సు కోసమే పరితపించే ఆయన చికిత్స పొందుతూ మృతిచెందడంతో గ్రామంలో పెద్దదిక్కును కోల్పోయినట్లయ్యింది. దీంతో గ్రామం అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి.శనివారం స్థానిక కబ్రిస్తాన్‌లో వందలాదిమంది బంధువులు,అభిమానుల మధ్య అంత్యక్రియలు జరిగాయి.

వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

తలకొండపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త:

తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం నాడు తలకొండపల్లి సిఐ జానకిరామ్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు దోర్నాల వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వాహనదారులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. బిజెపి నాయకులు దోర్నాల వెంకటేశ్వర రెడ్డి సహకారంతో ఉచితంగా మండలంలోని జర్నలిస్టులకు, వాహనదారులకు సొంత ఖర్చులతో హెల్మెట్లు కొనుగోలు చేసి వారికి సీఐ జానకి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ రెడ్డి మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్కరు క్షేమంగా ఉండాలని, వాహనదారులు ఎలాంటి ప్రమాదాల గురికాకుండా హెల్మెట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం తలకొండపల్లి సిఐ జానకిరామ్ రెడ్డి, ఎస్సై శేఖర్ ల ఆధ్వర్యంలో శనివారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్ షాద్నగర్ వెళ్లే రహదారిపై వెళ్తున్న టూవీలర్ వాహనదారులతో హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

హెల్మెట్లు పంపిణీ చేస్తున్న సిఐ, బిజెపి నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి

ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి జానకి రామ్ రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడంతో ప్రయాణికులకు ఎన్నో ప్రమాదాలు కొనితెచ్చుకుంటారని, హెల్మెట్ వాడకం వల్ల ప్రాణ నష్టం ఉండాలని ఆయన అన్నారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలకు హెల్మెట్ వాడకం మల్ల ఎంతో ఉపయోగ ఉంటుందని ప్రతి ఒక్కరు తప్పనిసరి టూ వీలర్స్ వాహనదారులు హెల్మెట్ ధరించాలని అన్నారు. చిన్నపిల్లలకు మైనర్లకు తమ వాహనాలు ఇవ్వరాదని వాళ్ళు ఎలాంటి ప్రమాదాన్ని గురిచేసిన వాహనం యజమానుల పై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, లైసెన్స్ ని కలిగి ఉండి ప్రమాదాలను నివారించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం హెల్మెట్ లేకుండా వెళ్లిన వాహనదారులకు చాలాన్లు వేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సిఐ జానకిరామ్ రెడ్డి, ఎస్సై శేఖర్, బిజెపి నాయకులు దోర్నాల వెంకటేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు నీలకంఠం పాండు, పద్మ అనిల్, కుమార్, మాజీ ఎంపిటిసి హేమ రాజు, మైనార్టీ మండల అధ్యక్షులు ఆరిఫ్ ,పోతుగంటి మహేష్ తోపాటు బిజెపి కార్యకర్తలు పోలీసులు వాహనదారులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారం
...కందనెల్లితాండా సర్పంచ్ ఆనంద్ నాయక్

పెద్దేముల్, ఆగస్టు 22, ప్రభాతవార్త: గ్రామంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని పెద్దేముల్ మండలంకందనెల్లితాండా సర్పంచ్ ఆనంద్ నాయక్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆనంద్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతుంటే కొందరు బిఆర్ఎస్ నాయకులు సహించలేక అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు. తమ ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజలు ముందు పెట్టాలని సవాల్ విసిరారు. రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయ త్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్వంత డబ్బులతో బోరింగ్, పైప్‌లైన్, సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులు చేపట్టామని గుర్తుచేశారు. గ్రామంలో 30 ఓల్టేజ్ గల ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేసామని అన్నారు. ఎన్నికల్లో తనపై పోటీచేసి ఓటమి చెందినందునే కావాలనే ఉద్దేశ్యంతో కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్షల కోసం గ్రామ అభివృద్ధిని అడ్డుకోవద్దని హితవు పలికారు.ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటు వారికి సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ నెల 13న సర్వసభ్య సమావేశంలో పంచాయతీ కార్యదర్శి విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని అన్నారు. 14న సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో యంపిడిఓ, యంపిఓల ఎదుట పంచాయతీ కార్యదర్శికి, తనకు వాగ్వివాదం జరుగుతుండగా, మా మధ్యన మరో పంచాయతీ కార్యదర్శి మల్లేశం తనపై గొడవకు దిగాడని ఆరోపించారు. గ్రామాభివృద్దే ప్రధాన ధ్యేయమని, తమది మాటల యుద్ధం కాదని, అభివృద్ధి పనులే మా సమాదానం అని అన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తు కేసులు బనాయించారని, ఉన్నతాధికారులే తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోక్యా, ఎస్.శంకర్, ఆర్.రతన్ సింగ్, జే.భోజ్యానాయక్, వి.మోహన్, రాథోడ్ కుమార్, రాందాస్, ఆర్,దేవుజానాయక్, జే.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనంద్ నాయక్

హర్ ఘర్ జల్ యజ్ఞం కార్యక్రమంలో సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి ,ఇతర నేతలు ,గ్రామస్థులు

తొమ్మిది రేకుల గ్రామంలో
ఘనంగా హర్ ఘర్ జల్ యజ్ఞం

కేశంపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త :

కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో ఖిహర్ ఘర్ జల్ఖి యజ్ఞం కార్యక్రమాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షి తమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సురక్షి త తాగునీరు గ్రామంలోని ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన, సురక్షి తమైన తాగునీరు అందుబాటులో ఉంచడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కలుషిత నీటి వల్ల వచ్చే రోగాల నుండి ప్రజలను కాపాడుకోవడానికి నీటి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డబ్ల్యు ఏ ఈ నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, జి పి ఓ కృష్ణయ్య,వార్డు సభ్యులు పోగుల నర్సింలు, నరేష్, లచ్చిరాం నాయక్, నాగిళ్ల హేమలత, యాదయ్య, కందెన సంతోష శివయ్య, గ్రామస్తులు గుత్తి శేఖర్, నిరంజన్, లాలమోని పాండు, షంబుల శేఖర్, వెంకటయ్య, గోస్కే కృష్ణయ్య, కానుగుల వెంకటయ్య, సత్యనారాయణ , పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయ ఉనికికోసమే బిఆర్ఎస్ నాయకుల 'ఇసుక' నాటకం

యాలాల, ఆగష్టు 22,ప్రభాతవార్త : రాజకీయంగా ఉనికిని కాపాడుకునేందుకే బిఆర్ఎస్ నాయకులు సిద్రాల శ్రీనివాస్,ఆయన అనుచరులు ఇసుక దర్నాలు చేస్తున్నారని యాలాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు,గ్రామ సర్పంచు సిహెచ్.శివయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు గొల్ల చెందు,నాయకులు రాపోల్ నాగయ్య,ఎఎంసి డైరెక్టర్ ఉప్పలి నర్సిములు,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బుర్నపురి నర్సిములు,హన్మంతు, మోయిజ్,శేఖర్, వేణు,నరేష్,మారుతి,సులేమాన్,శ్రీను,రాజు,అడివప్ప.శివ.బాలు తదితరులు ఆరోపించారు.శనివారం యాలాల మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ నాయకులు చేస్తున్నవి చిల్లర రాజకీయాలని వారు మండిపడ్డారు.గత రెండు దశాబ్దాలపైగా అక్రమ ఇసుక దందాకు పాల్పడిన బిఆర్ఎస్ నాయకులు సిద్రాల దయ్యాలు వేదాలు వల్లించినట్లు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటామనడం సిగ్గుచేటని వారు ధ్వజమెత్తారు.కాంగ్రెస్ సర్కార్ రైతుల పక్షపాతని,అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంలో ముందుంటామని వారు తెలిపారు. ప్రభుత్వ అనుమతులతో శివసాగర్ ప్రాజెక్టు నుంచి కొడంగల్ శ్రీవెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికికి ఇసుక తరలిస్తుంటే దాన్ని రాజకీయం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి,ఎమ్మెల్యేకు సంబంధం ఉన్నట్లు బట్ట కాల్చి వేయడం సబబు కాదని వారు హితవు పలికారు.అక్రమ ఇసుక రవాణాపై సిద్రాల శ్రీనివాస్ ఒక్కడే పోరాటం చేస్తున్నట్లు రాజకీయం చేయడం కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకేనని వారు ఎద్దేవా చేశారు.గత రెండున్నర,మూడు దశాబ్దాలుగా యాలాల కాక్రవేణీ,కాగ్నా నదుల్లోంచి అక్రమ ఇసుక దందా చేసిందెవరో మండల ప్రజలకు తెలుసని,ఆరోపణలు చేసే బిఆర్ఎస్ నాయకులు ముందుగా ఆత్మపరిశీలన చేసుకుంటే బాగుంటుందని వారు సూచించారు.గత వారం క్రితం కూడా అక్రమ ఇసుక అంటూ ఉద్యమం చేసే నాయకులు...ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి ట్రాక్టర్లు పోలీసులకు పట్టుబడిన విషయం మరిచిపోవడం విడ్డూరమని వారు గుర్తు చేశారు.తాము కూడా అక్రమ ఇసుక రవాణాకు వ్యతిరేకమని కాంగ్రెస్ నాయకులు పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీపై,ఎమ్మెల్యేపై అవాకులు,చవాకులు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు.ఇదిలా ఉండగా....

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ నాయకులు

'గుమ్మడికాయ దొంగ అంటే బుజాలు తడుముకోవడం అంటే ఇదేనేమో' :యాలాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు గుమ్మడికాయ దొంగ అంటే బుజాలు తడుముకున్న చందంగా మారింది.సక్రమంగా ఇసుక తరలిస్తుంటే ఇసుక మాఫియా నుంచి యాలాల గ్రామానికి ముడుపులు ఎలా అందాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కొడంగల్ శ్రీవెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి అనుమతులతో శివసాగర్ ప్రాజక్టుకు తరలిస్తుంటే యాలాలలో ఓ విగ్రహ నిర్మాణానికి ముడుపులు అందుకున్నారనే ఆరోపణలకు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాల్సి ఉంది.మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేస్తున్న కొంతమంది కాంగ్రెస్ నాయకులు కూడా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే మహానుభావులని గ్రామంలో పేర్కొవడం విశేషం.చెట్టుపేరు చెప్పి కాయ లమ్ముకునే రాజకీయాలు చేయడం మానుకొని తాము ఎంతవరకు నిజాయితీగా ఉంటూ ఇతరులపై ఆరోపణలు చేస్తున్నామోనని ఆత్మపరిశీలన చేసుకోవడం మంచిది.ఏది ఏమైనా యాలాలలో ఇసుక పంచాయతీ వ్యక్తిగత దూషణల వరకు వెళ్లడం ఆరోగ్యకరమైన రాజకీయం కాదని పలువురు పేర్కొంటున్నారు.ప్రజా ఉద్యమాలు పాజిటివ్‌గా తీసుకోవాలే తప్ప వ్యక్తిగత ప్రయోజనాలకు,రాజకీయ లబ్ధికి వాడుకోరాదని పలువురు పేర్కొంటున్నారు.

గాజీపూర్‌లో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్టాపన
..ప్రభుత్వ ఛీఫ్‌విఫ్‌కు గాజీపూర్ గ్రామస్థుల ఆహ్వానం

పెద్దేముల్, ఆగష్టు 22, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో ఈ నెల 31నాడు చెన్నకేశవస్వామి, నాగదేవత ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డిని హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రావాలని గాజీపూర్ గ్రామ నాయకులు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో మాజీ డిఎల్‌డిప చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యాక్షులు యండి.నసీర్, మాజీ సర్పంచ్‌లు రవికుమార్, వీరప్ప, నాయకులు లాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సాయులు గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి,ప్రకాష్‌రెడ్డి, బిచ్చన్న తదితరులు ఉన్నారు.

మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే పైలెట్‌ను ఆహ్వానించిన గాజీపూర్ గ్రామస్థులు

పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించే శ్రీ వెంకట చెన్నకేశవస్వామి, నాగదేవత ప్రతిష్టాపన మహోత్సవానికి తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని గ్రామ పెద్దలు, నాయకులు మణికొండలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహోత్స ఆహ్వాన పత్రికను అందజేసి ప్రతిష్టాపన కార్యక్రమానికి హజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో మాజీ డిఎల్‌డిఏ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవికుమార్, వీరప్ప, నాయకులు యండి.నసీర్, మహిపాల్‌రెడ్డి, లాల్‌రెడ్డి, సాయులుగౌడ్, ప్రకాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బిచ్చన్న తదితరులు ఉన్నారు.

రోహిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

ప్రతిష్టాపనకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన గాజీపూర్ నాయకులు

పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో ఈ నెల 31నాడు వెంకట చెన్నకేశవస్వామి, నాగదేవత ప్రతిష్టాపన మహోత్సవానికితాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని గ్రామ పెద్దలు, నాయకులు హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహోత్స ఆహ్వాన పత్రికను అందజేసి ప్రతిష్టాపన కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో మాజీ డిఎల్‌డిప చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవికుమార్, వీరప్ప, నాయకులు యండి.నసీర్, మహిపాల్‌రెడ్డి, లాల్‌రెడ్డి, సాయులుగౌడ్, ప్రకాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బిచ్చన్న తదితరులు ఉన్నారు.

మనోహర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

ఎస్ఐ విజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

ఎస్ఐ విజయ్‌కు ఘన సన్మానం

జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 22,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలో పని చేసిన ఎస్ఐ విజయ్‌కు మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగ సన్మాణించారు. ఇక్కడ విధులు నిర్వహించిన విజయ్ ఇటీవల షాబద్‌కు బదిలిపై వెల్లారు. ఈ సందర్భంగా బదిలీపై వెల్లిన విజయ్ సేవలను కొనియాడుతూ మండల నాయకులు, ప్రజలు శాలువాలు, పూల మాళలతో సన్మాణంచారు. ఆయన మండలానికి చేసిన సేవలను కొనియాడారు. మండలంలో ఎలాంటి అవాంచనియ సంఘటనలు చోటుచేసుకోకుండ ఎస్ఐ ఎంతో చాకచక్యంగ విధులు నిర్వహించారని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా పార్టీల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణవేద ప్రచార సత్సంగము

జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 22,(ప్రభాతవార్త): జిలల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజములో ఆదివారం నుంచి 47వ శ్రావణవేద ప్రచార సత్సంగము కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23వతేది నుంచి 25వతేది వరకు యజుర్వేద పారాయణ మహాయజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 22,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ వేదగిరి గుట్టపై గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు సంవృద్ధిగ పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మేడిపల్లి పెరుమాండ్ల హనుమాన్ ఆలయం వద్ద అన్న ప్రసాదం

యాచారం, ఆగస్టు 22, ప్రభాతవార్త : యాచారం మండల పరిధిలోని నక్కర్త మేడిపల్లి గ్రామ శివారులో ఉన్న పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం పి ఆర్ జి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అభిషేకం నిర్వ హించి అన్న ప్రసాద కార్యక్రమం రవీందర్ గుప్త తండ్రి ప్రొద్దుటూరి వెంకన్న గుప్త జ్ఞాపకార్థం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు. ఆంజనేయ స్వామి ఆలయం పునః నిర్మాణం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి విశ్రాంతి ఉపాధ్యా యులు బొగ్గుల పాపిరెడ్డి, బిజెపి నాయకులు కునిరెడ్డి అచ్చి రెడీ, కడ్తల్ ఎస్ టి సెల్ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్, పలేచెల్కతండ మాజీ సర్పంచ్ లోక్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ సీతారాం నాయక్, గోపాల్ నాయక్, బాదు బావొజి, బిజెపి టపాస్ బాలు నాయక్ తదితరులు ఉన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న నేతలు

విద్యా, వైద్యంకు అధిక ప్రాధాన్యత

కుల్కచర్ల, ఆగష్టు 22, ప్రభాతవార్త: సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని అధ్యక్షులు గోపాల్ నాయక్,మాజి అధ్యక్షులు వెంకటయ్య గౌడ్ అన్నారు. శనివారం అయ గ్రామాలకు చెందిన పలువురు ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందడంతోసిఎం రిలిప్ ఫండ్ చెక్కులు మంజూరు అయ్యాయి. స్థానిక నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు.ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వం విద్యా, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి అంజిలయ్య గౌడ్,పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి,చెరువుముందలి తాండ సర్పంచ్ రవిందర్ నాయక్,సినియర్ నాయకులు మోరా వెంకటేష్,సోషల్‌మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పక్కా ఇందిరమ్మ ఇండ్లు

గుడిసెల నివాసాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

చౌడపూర్, ఆగష్టు 22, ప్రభాతవార్త : గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలలో గుడిసెలలో నివసిస్తున్న వారిని గుర్తించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాల పరిస్థితిని పరిశీలించి, ఇందిరమ్మ ఇళ్లకు కావాల్సిన అర్హతలను పరిశీలించారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ , పిఏసిఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజితనర్సిములు , ఉపసర్పంచ్ ఏడ్ల రాములమ్మశ్రీను పీఏసిఎస్ డైరెక్టర్లు వెంకటయ్య, దామోదర్ రెడ్డి, కొత్తపల్లి చెన్నయ్య, మన్నెం , తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి, ఆగష్టు 22, ప్రభాతవార్త: ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా విడుదలైన ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని ,ఓటర్లకు ఫేజ్.2 పై అవగాహన కల్పించాలని బిఎల్ఏ లకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పలు సూచనలు చేశారు..శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిగి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి హాజరై, మాట్లాడుతూ... ఎస్.ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా పరిశీలన, బూత్ స్థాయిలో బిఎల్ఏల బాధ్యతల ను వివరించారు.. ప్రజలకు కల్పించాల్సి న అవగాహన అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలు, ఆధారాలతో నిర్ణీత సమయంలో సంబంధిత అధికారులకు వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఇబ్బందులు లేకుండా బిఎల్ఏలులు, కార్యకర్తలు సహకారం అందించాలని ఎమ్మెల్యే తెలిపారు.. ఆగష్టు నెల 27 వ తేదిన ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌ను ప్రజల ముందు ఉంచుతామన్నారు.. ప్రజలు గ్రామ సభలకు తప్పనిసరిగా హాజరవ్వాలని సుచించారు.జాబితాలో తప్పులను సరిచేసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి ్మ, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ యువ వికాసం తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు చేరేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు..త్వరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం శిక్షకులు రన్ ధీర్ ప్రత్యేక ప్రెజెంటేషన్ ద్వారా ఎస్.ఐ.ఆర్. ఫేజ్ 2 పై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారా సింగ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి జంగా రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ఎస్ఐఆర్' రెండోదశ విధులను సక్రమంగా నిర్వహించాలి

తూంకుంటలోని కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎఇఆర్ఓ పి.మధుసూదన్‌రెడ్డి,పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, బిఎల్ఓలు, బిఎల్ఎలు,సిబ్బంది తదితరుల దృశ్యం

శామీర్‌పేట, ఆగష్టు 22, ప్రభాతవార్త:ఎన్నికల ఓటరు జాబితాకు ఎస్ఐఆర్‌కు సంబంధించి రెండవ దశ విధులను బిఎల్ఓలు, సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ ఏఇఆర్ఓ పి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం తూంకుంటలోని మున్సిపల్ శామీర్‌పేట డివిజన్ కార్యాలయంలో ఎస్ఐఆర్ రెండవ దశ కార్యక్రమంపై బిఎల్ఓలకు, సిబ్బందికి,బిఎల్ఎలకు అవగాహనను ఆయన కల్పించారు. ఎస్ఐఆర్ రెండవ దశకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎఇఆర్ఓ పి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ రెండవ దశ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల ఓటరు జాబితాలకు సంబంధించి ఎటువంటి పొరపాట్లు లేకుండా పత్రాలను పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికపుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధుసూదన్‌రెడ్డి సూచించారు. జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ రెండవ దశ కార్యక్రమం అత్యంత ముఖ్యమైందని, దీనిలో ప్రతి సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్, బిఎల్ఓలు, బిఎల్ఎల తమ బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ అవసరమైన సమాచారం, మార్గదర్శకాలు అందించాలని అన్నారు. ఓటర్లకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి సరైన సమాచారాన్ని నమోదు చేయటంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమస్యలు, సందేహాలు ఉంటే అధికారులకు దృష్టికి తీసుకవెళ్లాలని ఆయన సూచించారు. బిఎల్ఓలు ఓటర్లకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు జాన్, రజిత, రూపా, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

చూసి చూడనట్లు వ్యవరిస్తున్న సంబంధిత అధికారులు

కుల్కచర్ల, ఆగష్టు 22, ప్రభాతవార్త : కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెలం, అనంతసాగర్ పెద్దవాగుల నుంచి రాత్రి వేళల్లో జోరుగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతుంది.సంబంధిత అధికారుల కనుసైగల్లోనే ఈ అక్రమ ఇసుక వాపారం కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మండల పరిధిలోని చాపలగుడెం, రాంపూర్, ఇప్పాయిపల్లి, కుసుమసముద్రంగ్రామాలల్లో సాయంత్రం 6 దాటిందంటే చాలు విచ్చవిడిగా అక్రమ ఇసుకను తర లించే ట్రాక్టర్లు,టిప్పర్ల యజమానులు ఆడిందే ఆట,పాడిందే పాటగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుంది.చాపలగుడేం, రాంపూర్ గ్రామాల సమిపంలో కొందరు ఇసుకను దంపులలుగా పోసి రాత్రి సమయంలో టిప్పర్ల ద్వారా సమీప గ్రామాలతో పాటు ఇతర మండలాలకు తరలిస్తు న్నారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

ఒక్కో టిప్పర్‌కు రూ. 30 నుండి, 40 వేల రూపాయలకు అమ్ముకుని సోమ్ము చేసుకుంటున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తు న్నారు.అక్రమ ఇసుక రవాణ వెనుకఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు, సంబంధిత అధికారుల హస్తం ఉండడం వల్లే అడ్డుకట్ట వేయలేకపోతునట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలనే పై అధికారుల ఆదేశాలను స్థానిక అధికారులు బేఖాతరు చేయడంతో చాపలగుడె, రాంపూర్, అనంతసాగర్ గ్రామాలలో వారంలో మూడు నుండినాలుగు రోజులపాటు రాత్రి వేళలో అక్రమంగా ఇసుక రవాణా యధేచ్ఛగా కొనాసాగుతుంది.సంబంధిత అధికారులు, పోలీసులు గస్తి నిర్వహించి అక్రమ ఇసుక రవాణాచేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, చిత్రంలో విద్యార్థులు

హెచ్‌పివి టీకాపై విద్యార్థినులకు అవగాహన

షాద్‌నగర్, ఆగష్టు 22, ప్రభాతవార్త : హెచ్‌పివి టీకాపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి టీకా తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు సూచించారు. మొగిలిగిద్దలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జె. శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్‌పివి అనేది సాధారణంగా కనిపించే వైరస్ అని, ఇందులోని కొన్ని అధిక ప్రమాద రకాల వల్ల భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు ఇతర క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు.హెచ్‌పివి సంక్రమణను, దాని వల్ల కలిగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పివి టీకా అత్యంత ప్రభావవంతమైన రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సమీక్షల ప్రకారం హెచ్‌పీవీ టీకా సురక్షి తమైనదని, సమర్థవంతమైనదని పేర్కొన్నారు. టీకా తీసుకున్న తర్వాత ఇంజెక్షన్ వేసిన ప్రదేశంలో స్వల్ప నొప్పి లేదా వాపు, తేలికపాటి జ్వరం, అలసట, తలనొప్పి వంటి తాత్కాలిక లక్షణాలు కనిపించవచ్చని, సాధారణంగా ఇవి తగ్గిపోతాయని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు అర్హత ఉన్న బాలికలు తప్పకుండా హెచ్‌పివి టీకా తీసుకోవాలని సూచించారు.టీకా నేడు – ఆరోగ్యకరమైన భవిష్యత్తు రేపు" అనే సందేశంతో విద్యార్థినుల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, కేజీబీవీ పాఠశాల స్టాఫ్ నర్స్ సంతోష, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం ఎమ్మెల్యేకు సన్మానం

షాద్‌నగర్, ఆగష్టు 22, ప్రభాతవార్త : షాద్‌నగర్ చేనేత సహకార సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంఘం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఈసనగారి రామస్వామి, ప్రధాన కార్యదర్శి చెన్న బాలరాజు, కోశాధికారి అద్దేట్ల రాజు, డైరెక్టర్లు ఉడుత శేఖరయ్య, ఈసనగారి అంజయ్య, ఈసనగారి శివకుమార్, ఈసనగారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చేనేత సహకార సంఘం నాయకులు

విద్యాభివృద్ధికి రాజా బహదూర్ చేసిన కృషి మరువలేనిది

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్, ఆగష్టు 22, ప్రభాతవార్త : రాజా బహదూర్ వెంకటరామి రెడ్డి జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలో విద్యాభివృద్ధికి, మహిళా విద్యకు విశేష ప్రాధాన్యతనిస్తూ ప్రజల అభ్యున్నతికి రాజా బహదూర్ వెంకటరామి రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి ఆయన చూపిన మార్గం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో విద్యా వెలుగులు నింపేందుకు, యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అంజయ్య యాదవ్ తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ లక్ష్మీ ్మనరసింహా రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, రాజరామేశ్వర్ రెడ్డి, రాములు, కౌన్సిలర్లు శారద శేఖర్, వాణి పాండురంగారెడ్డి, వసంత శ్రీనివాస్, గోపాల్, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, కానుగు అంతయ్య, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, లంకాల రాఘవేందర్ రెడ్డి, రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, భువనేశ్వర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జగన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజా బహదూర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ...

రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి జయంతిని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. పోలీసు అధికారిగా పనిచేస్తూనే సమాజ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి సేవలు అమోఘమని అన్నారు. ముఖ్యంగా విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పేద విద్యార్థుల కోసం హాస్టల్ వసతులు, విద్యా అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, ఫరూక్‌నగర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, కౌన్సిలర్ పెంటయ్య మురళీమోహన్, రాజు నాయక్, బచ్చలి నరేష్, సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, మాజీ జడ్పీటీసీ వెంకటరాం రెడ్డి, కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు రాంబల్ నాయక్, పినపాక ప్రభాకర్, దొడ్డి శ్రీనివాస్, అబ్దుల్ రజాక్, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్ రెడ్డి, నేతలు చెంది తిరుపతి రెడ్డి, చెంది మహేందర్ రెడ్డి, పందెం చెన్నారెడ్డి, పాండురంగారెడ్డి, విఘ్నేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రపాల్ రెడ్డి, చందు నాయక్, జంగారి రవి, సందీప్ గౌడ్, వినాయక గౌడ్, మాధవులు యాదవ్, కత్తి చంద్రశేఖరప్ప, అన్వర్, ఇబ్రహీం, శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజా బహదూర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే తదితరులు

విద్యార్థులకు బందె రాజేందర్ రెడ్డి చేయూత

యాచారం,ఆగష్టు 22, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మట్టిలో మాణిక్యాల అని బందే రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని కురుమిద్ద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బందే రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠ్యపుస్తక సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ.. మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు. మట్టిలో మాణిక్యాలను విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నత స్థాయికి ఎదిగేలా బోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన అన్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు అన్నదానం చేశారు. పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లు, పరీక్షా సామగ్రి, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎంతో కీలకమైనవని, భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షలను ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, సమయపాలన పాటిస్తూ ప్రతి సబ్జెక్టుపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. బందె రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, శ్రీనివాస్, అశోక్, రాణి, వీరమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే బందె రాజేందర్ రెడ్డి అభిమానులు పంది శ్రీను, గోపలి మహేందర్, గోపలి పవన్ కుమార్, పంది వెంకటేష్, మంద డేవిడ్, పంది అరవింద్, బాబురావు, కోటేశ్, యశ్వంత్, నాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పాఠ్య సామాగ్రి అందజేస్తున్న సిఐ ,ఉపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, విద్యార్థులు

గోకఫస్లావాద్ హైస్కూల్‌లో యాంటీ డ్రగ్స్ అవగాహన

దౌల్తాబాద్,ఆగష్టు 22,ప్రభాతవార్త: దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లావాద్ హైస్కూల్‌లో శనివారంరోజు లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్ సోల్జర్ లయన్ వడ్డే భీమ్‌రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.డ్రగ్స్ ,ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే తీవ్ర అనర్థాల గురించి,వాటి వలన ఆరోగ్యం,ఉజ్వల భవిష్యత్తు ఏవిధంగా నాశనమవుతాయో ఆయన విద్యార్థులకు వివరించారు.ఈ సంధర్భంగా విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని,తోటివారి ఒత్తిడికి ఎట్టి పరిస్థితుల్లోనూ లోనుకాకూడదని ఆయన హితవు పలికారు.మత్తు పదార్థాలకు ధైర్యంగా 'నో' చెప్పాలని,విద్యార్థులు తమ పూర్తి దృష్టిని లక్ష్యసాధనపైనే కేంద్రీకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫయాజ్‌తో పాటు పాఠశాల ప్రధానోధ్యాయులు,ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యాంటీ డ్రగ్స్ సోల్జర్ వడ్డే భీములు

ఆడబిడ్డ పుట్టిన ప్రతి కుటుంబానికీ ఆర్థిక చేయూత

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిమ్మానోళ్ల శ్రీరామ్‌రెడ్డి

షాబాద్, ఆగష్టు 22, ప్రభాతవార్త : ఆడబిడ్డ ఇంటికి మహాలక్ష్మి వంటిదని, ఆడపిల్ల పుట్టిన ప్రతి కుటుంబాన్ని ప్రోత్సహించేందుకు తనవంతు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిమ్మానోళ్ల శ్రీరామ్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కడుమూరి శేఖర్, విద్యారాణి దంపతులకు ఆడబిడ్డ జన్మించడంతో శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5,211 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆడపిల్లలపై వివక్షచూపకుండా మగ పిల్లలతో సమానంగా పెంచాలని సూచించారు. నేడు మహిళలు రాజకీయాలు, ఉద్యోగాలు, వ్యవసాయం, వ్యాపారం తదితర అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డల ఎదుగుదలకు తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా అండగా నిలవాలని కోరారు. గ్రామంలో ఏ కుటుంబంలో ఆడబిడ్డ పుట్టినా వారిని ప్రోత్సహిస్తూ తనవంతు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు.కార్యక్రమంలో మొగిలిగిద్ద బంధయ్య, కడుమూరి విట్టలయ్య, సంటమోళ్ల మహేందర్, కావలి రాములు, రహేమాన్ పాల్గొన్నారు.

ఆడబిడ్డ తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిమ్మానోళ్ల శ్రీరామ్‌రెడ్డి

పేదలకు చేయూతకోసం ఏడు నెలల వేతనం

దాతృత్వం చాటుకున్న హకీంపేట్ సర్పంచ్

దుద్యాల్, ఆగష్టు 22, ప్రభాతవార్త: ప్రజాప్రతినిధిగా తనకు అందిన వేతనాన్ని పేదలకు చేయూతగా అందిస్తూ హకీంపేట్ సర్పంచ్ రవీంద్ర నరసింహారెడ్డి తన సేవాదృక్పథాన్ని చాటుకు న్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఇచ్చిన మాట మేరకు, ఏడు నెలల వేతనంగా వచ్చిన మొత్తం రూ.45,500 ను ముగ్గురు నిరుపేదలకు గ్రామసభలో అందజేశారు. హనుమాన్ సాయప్ప కు రూ.17,500, దేవాలయాల్లో సఫాయి పనులు చేస్తున్న సందుల బాలమ్మకు రూ.14,000, ఆధారం లేని ఒంటరి మహిళ ఏదుల రాములమ్మకు రూ.14,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు.తనకు వచ్చే వేతనాన్ని అవసరమైన వారికి ఉపయోగపడేలా పంపిణీ చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సర్పంచ్ రవీంద్ర నరసింహారెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

ప్రార్థించే పెదాల కన్నా సహాయం చేసే చేతులే మిన్న

ఓపెన్ హార్ట్ సర్జరీతో ఆసుపత్రి పాలైన మంగలి శ్రవణ్ భార్యకు రూ.40 వేలు అందజేత

నందిగామ, ఆగష్టు 22, ప్రభాతవార్త: ప్రార్థించే పెదాల కన్నా సహాయం చేసే చేతులే మిన్న అను నానుడిని అక్షరాల నిజం చేసి మానవతామూర్తులు అనిపించుకున్నారు ఆపదలో.. సాపదలో.. కష్టంలో.. నష్టంలో.. అత్యవసర సమయంలో తాము ఉన్నామని మరోసారి నిరూపించుకున్నారు నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన సర్పంచ్ రమావత్ మారు భర్త మాజీ ఎంపిటిసి రాజునాయక్, మేకగూడ మాజీ ఉపసర్పంచ్ మామిళ్ళపల్లి నర్సింలు. మేక గూడకు చెందిన మంగలి శ్రవణ్ భార్య సంధ్యకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఆపదలో కష్టకాలంలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న వారు బాధితురాలు భర్త మంగలి శ్రవణ్‌కు శనివారం రాజు నాయక్, మామిళ్ళపల్లి నర్సింలు ఇరువురు ఒక్కొక్కరు రూ.20 వేల చొప్పున 40,000 ఆర్థిక సాయం అందజేశారు. అధైర్య పడొద్దు అండగా ఉంటానని కష్టకాలంలో మాటిచ్చి కొండంత భరోసా ఇచ్చారు. కష్టకాలంలో తన కుటుంబానికి అండగా ఉండి ఆర్థిక సాయం చేసి తమ బతుకుకు భరోసా ఇచ్చిన మానవతామూర్తులు మాజీ ఎంపీటీసీ రాజనాయక్‌కి మాజీ ఉపసర్పంచ్ మామిళ్ళపల్లి నరసింహులుకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఆదుకున్న సేవామూర్తులను బిఆర్ఎస్ సీనియర్ నేత మేకం రాజు ముదిరాజ్ అభినందించారు. మానవతామూర్తుల వెంట ఉప సర్పంచ్ ఎడ్ల శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులు కురువ మల్లేష్, స్వప్న, సత్యం రెడ్డి, ఎం శ్రీశైలం, మాజీ వార్డ్ సభ్యులు కావలి కృష్ణ ముదిరాజ్, ఎడ్ల వెంకటేష్ యాదవ్, కుమ్మరి వెంకటేష్ తదితరులు ఉన్నారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు